సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం। 18। మార్చి। 2024



వైభవంగా అడ్డ పల్లకీ ఉత్సవం

ఉరవకొండ గవిమఠం బ్రహ్మోత్సవాల్లో ఆదివారం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి అడ్డపల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. 8లో



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4. నరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.08



న్యూస్‌రీల్

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి

- గుంతకల్లు డీఎల్‌డీఓగా లలితబాయి బదిలీ



జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా వైపీ రమణారెడ్డి నియమితులయ్యారు. డ్వామా విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఆయనను డిప్యూటీ సీఈఓగా బదిలీ చేస్తూ అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ డిప్యూటీ సీఈఓగా పనిచేసిన లలితబాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. రమణారెడ్డి గతంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేశారు. 2019 ఆగస్టు నుంచి 2020 జూన్ వరకు బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, జెడ్పీలో కొంతకాలంగా అధికారులు, పాలకవర్గం నడుమ సఖ్యత లేదు. లలితబాయి తీరుపై సభ్యులు గుర్రుగా ఉన్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంతో పాటు స్థాయీ సంఘాల సమావేశాల్లో లలితబాయితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఈఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఈఓను ప్రభుత్వానికి సరెండర్ చేసే వరకూ సమావేశాలకు హాజరుకామని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే లలితబాయిని బదిలీ చేసి రమణారెడ్డిని నియమించడం గమనార్హం.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ అభిషేక్ కుమార్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. ముందుగా ఆయన తహసీల్దార్ కార్యాలయనికి, ఆ తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లారు. ఎంపీడీఓ విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా అధికారుల్లో ఇంత అలసత్వం పనికి రాదని మండిపడ్డారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు పర్చాలన్నారు. రాజకీయ పార్టీల పోస్టర్లు, హోర్డింగ్‌లు ఎక్కడా కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. అక్కడ డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చికిత్స అందించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సజావుగా గ్రూప్–1 ప్రిలిమ్స్

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా గ్రూప్–1 ప్రిలిమ్స్ సజావుగా జరిగింది. 33 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు 64.68 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 11,597 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి సెషన్‌కు 7,542 మంది (65.03 శాతం) హాజరయ్యారు. 4,055 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పరీక్షకు 7,459 మంది (64.32 శాతం) హాజరయ్యారు. 4,138 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కో–ఆర్డినేటింగ్ అధికారి, అనంతపురం నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షల నిర్వహణను ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్లు యోగేశ్వరరావు, వెంకటరమణ పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. అభ్యర్థులను తనిఖీ చేసిన తరువాత కేంద్రంలోకి అనుమతించారు. ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటన కూడా చోటు చేసుకోలేదు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కో-ఆర్డినేటింగ్ అధికారి, కమిషనర్ మేఘ స్వరూప్



అభ్యర్థులను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు



కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థిని

విద్యార్థీ.. విజయీభవ

ఆల్ ద బెస్ట్..
- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- సర్వం సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- పేపర్ లీక్ చేస్తే అడ్డంగా బుక్ అవుతారని అధికారుల హెచ్చరిక

పుట్టపర్తి: విద్యార్థి జీవితంలో తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే రోజు రానే వచ్చింది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 30న ముగుస్తాయి. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో సహజంగా భయం, ఆందోళన ఉంటుంది. వీటిని అధిగమించడానికి ఆయా స్కూళ్లలో హెచ్‌ఎంలు, టీచర్లు విద్యార్థులకు అవగాహన కల్పించి సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 115 కేంద్రాల్లో 27,555 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందు కోసం 1,250 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలుంటాయి. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచరు, విద్యుత్ సదుపాయం ఉండేలా అధికారులు దృష్టి సారించారు.

గంట ముందే చేరుకోవాలి..

తొలిరోజు విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముందుగా వచ్చి హాల్‌టికెట్ నంబరు ఆధారంగా ఏ గది ఎక్కడుందో చూసుకోవాలని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం ఉంటుంది. హాల్‌టికెట్ చూపిస్తే చాలు ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పోలీసుస్టేషన్ల నుంచి ప్రశ్నపత్రాలు తీసుకొచ్చే సమయం, వాటిని ఓపెన్ చూసి విద్యార్థులకు అందజేసే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

అక్కడ అందరూ బయటకు వెళ్లాల్సిందే..

పరీక్ష కేంద్రాలుగా ఉన్న రెసిడెన్షియల్ స్కూళ్లలోని (బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్లు) ఇతర తరగతుల విద్యార్థులు, సిబ్బంది పరీక్షలు జరిగే సమయంలో బయటకు వెళ్లాల్సిందే. ఆ సమయంలో కేవలం ఆ కేంద్రంలో పరీక్ష రాయనున్న విద్యార్థులు, విధుల్లో పాల్గొనే సిబ్బంది మాత్రమే ఉంటారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల్లోకి సిబ్బంది కోసం టీ, కాఫీ బయట నుంచి తీసుకురాకూడదు. పొరబాటున ఏ ఒక్క వ్యక్తి బయటకు వచ్చినా అందుకు ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటిండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారి, ఎంఈఓలను బాధ్యులను చేస్తారు. సిబ్బంది చాలా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలోని విద్యార్థులకు ప్రశ్నపత్రాలు అందించిన అరగంట తర్వాత గైర్హాజరైన విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నపత్రాలన్నీ ఇన్విజిలేటర్ల నుంచి వెనక్కు తీసుకుని ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయాలి.

పరీక్ష కేంద్రాలు	115
పరీక్షలు రాయనున్న విద్యార్థులు	27,555
పరీక్ష సమయం	ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పుట్టపర్తి అర్బన్: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ప్రశ్నపత్రం లీక్ చేస్తే క్యూఆర్ కోడ్ ఆధారంగా బాధ్యుడిని గుర్తించవచ్చన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి విద్యాశాఖ అధికారులతో పదో తరగతి పరీక్షలపై సమీక్షించారు. ఈ నెల 30 వరకు జరిగే పదో తరగతి పరీక్షలు కట్టు దిట్టంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ మీనాక్షి చెప్పారు. ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదవుతుందన్నారు. పరీక్షా కేంద్రాలను మొబైల్ ఫ్రీ జోన్‌గా ప్రకటించినట్లు చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లు మినహా విద్యార్థులతో పాటు ఇంకెవ్వరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లరాదన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి : ఆర్‌జేడీ

పుట్టపర్తి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ రాఘవరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కొత్తచెరువు బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన గూగుల్ మీట్‌లో డీఈఓ మీనాక్షి, ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌జేడీ ఆదేశించారు. ఇదే విషయాన్ని డీఈఓ మీనాక్షి అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

తేలని పంచాయితీ

- హాట్ టాపిక్‌గా మారిన ధర్మవరం సీటు
- టీడీపీ – బీజేపీ మధ్య కుదరని సయోధ్య
- పట్టు వదలని పరిటాల శ్రీరామ్ వర్గీయులు
- తనదైన శైలిలో వరదాపురం సూరి లాబీయింగ్
- చంద్రబాబు, లోకేశ్ వైఖరిపై 'తమ్ముళ్ల' మండిపాటు



సాక్షి, పుట్టపర్తి: 'అతుకుల బొంత.. రోజూ చింత' తరహాలో పెద్దల స్థాయిలో బీజేపీ – జనసేన – టీడీపీ కలిసినా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏ పార్టీ అభ్యర్థి బరిలో నిలిచినా మిగిలిన రెండు పార్టీల నుంచి సహకారం కరువవుతోంది. ఓ వైపు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించింది. కానీ టీడీపీ– బీజేపీ– జనసేన కూటమి ఇంకా కొన్ని స్థానాలను పెండింగులోనే ఉంచింది. ఫలితంగా మూడు పార్టీల నుంచి ఆశావహులు తెరపైకి వస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడే పరిస్థితి ఎదురవుతున్న సందర్భంలో వర్గాలు ఏర్పడుతున్నాయి. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ సీటు పంచాయితీ ఇంకా తేలనే లేదు. ఓ వైపు బీజేపీ తరఫున తనకే వస్తుందని వరదాపురం సూరి (గోనుగుంట్ల సూర్యనారాయణ) చెబుతున్నారు. మరోవైపు టీడీపీకే కేటాయించాలని, పరిటాల శ్రీరామ్ బరిలో ఉండాలని ఆయన వర్గీయులు ర్యాలీలు చేస్తున్నారు. రెండు పార్టీల మధ్య గ్యాప్ పెరిగింది. ఫలితంగా ఆ ఇద్దరిలో ఏ ఒక్కరు పోటీలో ఉన్నా మరో వర్గం వ్యతిరేకంగా పనిచేయడం ఖాయమని భావిస్తున్నారు.

ఎంపీ అభ్యర్థి కోసం వెతుకులాట

హిందూపురం పార్లమెంటు సీటు బీజేపీకి ఇస్తారని తొలుత ప్రచారం జరిగింది. బీజేపీ నేత పరిపూర్ణానంద స్వామి కొన్ని రోజుల పాటు ప్రచారం కూడా చేశారు. అయితే టీడీపీనే పోటీ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఫలితంగా టీడీపీ నుంచి నిమ్మల కిష్టప్ప, అంబికా లక్ష్మీ నారాయణ, బీకే పార్థసారథి టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. ఆ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా మిగతా ఇద్దరూ సహకరించని పరిస్థితి. అంతేకాకుండా టికెట్ ఇవ్వని పక్షంలో నిమ్మల కిష్టప్ప స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీని ఓడించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. దీంతో ఎంపీ సీటు ఎవరికి ఇవ్వాలనే దానిపై టీడీపీ అధిష్టానం ఫోన్ కాల్స్ సర్వే మొదలుపెట్టింది.

పుట్టపర్తి సీటు మార్పు?

పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ టికెట్ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరరెడ్డికి ఇచ్చారు. అయితే ప్రచారం తొలిరోజునే ఎండవేడిమిని తట్టుకోలేక ఆస్పత్రిలో చేరారు. మరోవైపు సమర్థులకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని వడ్డెర సంఘం నాయకులు చంద్రబాబు నాయుడు వద్ద డిమాండ్ చేస్తున్నారు. దీంతో టికెట్‌పై చంద్రబాబు, లోకేశ్ పునరాలోచన చేస్తున్నట్లు తెలిసింది. పల్లె సింధూరరెడ్డి స్థానంలో పల్లె రఘునాథరెడ్డికే ఇస్తారనే టాక్ వినిపిస్తోంది. 'పల్లె' కుటుంబంలో ఎవరికి ఇచ్చినా బీసీ సామాజిక వర్గాల నుంచి వ్యతిరేకత రావడం ఖాయమని సొంత పార్టీ నాయకులే చెబుతున్నారు.

'తమ్ముళ్ల' మండిపాటు

అభ్యర్థుల ప్రకటన విషయంలో చంద్రబాబు, లోకేశ్ వైఖరిపై టీడీపీ కార్యకర్తలు మండిపడుతున్నారు. సీనియర్ నాయకులను సంప్రదించకుండా అభ్యర్థులను ప్రకటించడం సరికాదని విమర్శిస్తున్నారు. మరోవైపు బీసీ సామాజిక వర్గాలను విస్మరించి సొంత సామాజిక వర్గానికే టీడీపీలో పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి కదిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

కదిరి: వసంత వల్లభుడిగా, కాటమరాయుడిగా, ప్రహ్లాద వరదుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19న ప్రారంభం కానున్నాయి. పక్షం రోజులపాటు జరుగుతాయి. శ్రీ మహావిష్ణువు దానవుడైన హిరణ్యకశ్యపుని శిక్షించేందుకు, తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేందుకు 'నర–సింహ' అవతారంలో స్తంభం నుంచి ఉద్భవించాడు. హిరణ్య కశ్యపుని సంహరించిన అనంతరం శ్రీవారు ఆ ఉగ్ర రూపంలోనే కదిరి కొండ వద్ద సంచరించ సాగాడు. స్వామి అలాగే ఉండటం సరికాదని భావించిన మహర్షులు కొండపై నుంచి నారసింహుని వేడుకున్నారు. దీనికి గుర్తుగా ఆ కొండపై నారసింహుని ఆలయం కూడా ఉంది. అదే కొండపై శ్రీవారి పాద ముద్రికలు ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఖాద్రి' అని పిలిచారు. 'ఖా' అంటే విష్ణుపాదమని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. ఖాద్రి ఇప్పుడు కదిరిగా పిలవబడుతోంది.

మహిమాన్వితుడు

కదిరి ప్రాంతంలో ఒకప్పుడు ఖాదిరి వృక్షాలు (చంద్ర వృక్షాలు) ఎక్కువగా ఉండేవి. ఈ చెట్ల కింద ఒక పుట్టలో నారసింహుడు స్వయంభువుగా వెలిశాడని, అందుకే ఖాద్రీ నారసింహుడని పిలుస్తున్నారని మరో కథనం. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు ఇక్కడి మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. అభిషేకానంతరం హృదయ భాగం నుంచి స్వేద బిందువులు చూడచ్చు. ఇది స్వామివారి మహిమ అని అర్చకులు చెబుతారు.

రంగనాయకుడి కల ఈ ఆలయం

పదో శతాబ్దంలో అప్పటి పట్నం పాలేగారైన రంగనాయకుడికి చెందిన గోవులు రోజూ ఖాదిరి వృక్షం కింద ఉన్న పుట్టలో పాలు వదిలేవి. ఆ పాలను నారసింహుడు తాగేవారని భక్తుల నమ్మకం. అందువల్లనే రంగనాయకులు ఆర్థికంగా బాగా ఎదిగారని ఒక కథనం. ఓరోజు ఆయనకు శ్రీవారు కలలో కన్పించి తాను స్వయంభువుగా వెలిశానని, పుట్టలో ఉన్న తన విగ్రహాన్ని వెలికితీసి గుడి కట్టించాలన్న కోరిక మేరకు ఆలయం నిర్మించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. నాటి ఆలయం కాల గతిలో అదృశ్యం కావడంతో బుక్కరాయలు, ఆ తర్వాత హరిహర రాయలు, చివరిగా శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఈ గుడి సంపూర్ణ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

వసంత వల్లభుడని ఎందుకంటారంటే..

శ్రీ మహా విష్ణువు అనుగ్రహం కోసం భృగు మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన విష్ణువు తాను కోనేటిలో వెలిశానని, తన విగ్రహాలను వెలికి తీసి పూజాది కార్యక్రమాలు చేయాలని భృగు మహర్షిని కోరినట్లు కథనం. ఉత్సవ విగ్రహాల వెలికతీత జరిగింది వసంత మాసంలో కనుక స్వామివారికి వసంత వల్లభుడని పేరు వచ్చింది. అందుకే కోనేరును భృగు తీర్థమని పిలుస్తారు.





నాలుగు గోపురాల నడుమ వెలసిన ఖాద్రీశుని ఆలయం (ఇన్‌సెట్‌లో) శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

ఏ రోజు ఏ ఉత్సవం..

మార్చి 19న	అంకురార్పణం
20న	కల్యాణోత్సవం
21న	హంస వాహనం
22న	సింహ వాహనం
23న	హనుమంత వాహనం
24న	బ్రహ్మ గరుడ సేవ
25న	శేష వాహనం
26న	సూర్య, చంద్ర ప్రభ
27న	మోహినీ ఉత్సవం
28న	ప్రజా గరుడ సేవ
29న	గజ వాహనం
30న	రథోత్సవం (తేరు)
31న	అశ్వ వాహనం
ఏప్రిల్ 1న	తీర్థవాది ఉత్సవం
ఏప్రిల్ 2న	పుష్ప యాగోత్సవం

స్వామి సేవకే అంకితం



లక్ష్మీనరసింహస్వామికి ఎన్నో ఏళ్లుగా సేవ చేస్తున్నాను. ప్రహ్లాద సమేత లక్ష్మీ నారసింహుడి దర్శనం కదిరిలో తప్ప ఇంకెక్కడా జరగదు. బ్రహ్మోత్సవాలు 15 రోజుల పాటు జరిగేది కూడా ఇక్కడే. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు మాత్రమే మూల విరాట్‌కు అభిషేకం చేస్తాం. అప్పుడు మూలవిరాట్ నుంచి వచ్చే స్వేద బిందువులను చూస్తే స్వామి మహిమ ఏంటో తెలుస్తుంది. – నరసింహాచార్యులు, ప్రధాన అర్చకులు

బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్యాన్నదానం ఉంటుంది. కల్యాణోత్సవంతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిన కారణంగా రాజకీయాలకు తావులేకుండా ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల సహాయ సహకారాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం. –శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు బంపర్ ఆఫర్

- ఈ నెల 31లోపు చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ
- ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మందికి లబ్ధి



పుట్టపర్తిలో వడ్డీ మాఫీ పథకంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పురపాలక సంఘం పరిధిలో ఆస్తిపన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. భవన, ఖాళీ స్థల యజమానులు ఆస్తి పన్ను బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తామని ఉత్తర్వులు జారీ చేసింది. గత సంవత్సరం ముగింపులోనూ వడ్డీ మాఫీ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–024)లోనూ కొనసాగించింది.

నెలాఖరు వరకు గడువు

వడ్డీ మాఫీ వర్తించాలంటే బకాయి మొత్తం ఒకే సారి చెల్లించాల్సి ఉంటుంది. 2023 మార్చి నెలాఖరు వరకు ఉన్న బకాయిలపై100 శాతం వడ్డీ మాఫీ చేయనున్నారు. ఈ నెల 31 లోగా చెల్లిస్తేనే వడ్డీ మాఫీ వర్తిస్తుంది. ఆస్తి పన్ను బకాయిల వసూలుకు పుట్టపర్తి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అంతే కాదు టీములుగా ఏర్పడి సచివాయల సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. ఎక్కువ పన్ను బకాయిలు ఉన్న భవన యజయానుల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

వసూలు లక్ష్యం రూ.5.98 కోట్లు

పుట్టపర్తి మున్సిపాలిటీలో 13,994 అసెస్ మెంట్లు ఉన్నాయి. పాత బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులు కలిపి మొత్తం రూ.5.98 కోట్లు వసూలు కావలసి ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.1.53 కోట్లు వసూలైంది. ఇంకా రూ 4.51 కోట్లు వసూలు కావాల్సి ఉంది. వడ్డీ మాఫీకి సంబంధించి సాఫ్ట్‌వేర్‌ను సైతం రూపొందించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీని పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు సద్వినియోగపరచుకోవాలి. నెలాఖరులోపు భవన, ఖాళీ స్థలాల యజమానులు ఆస్తి పన్ను మొత్తం చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం. పన్నుల బకాయిలు వంద శాతం వసూళ్ల లక్ష్యంగా పనిచేస్తున్నాం.
– అంజయ్య, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం, వాహనాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

గోరంట్ల: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 864 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని ఆదివారం తెల్లవారుజామున గోరంట్ల మండలం మిషన్ తండా సమీపంలో సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐచర్ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి పెనుకొండ కోర్టులో హాజరు పరిచినట్లు సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొన్న వాహనం



నుజ్జునుజ్జయిన ఎద్దుల బండి

చెన్నేకొత్తపల్లి: స్థానిక 44వ జాతీయ రహదారిపై ఎద్దులబండిని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... చెన్నేకొత్తపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఎద్దులబండి ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పనుల నిమిత్తం ఎద్దుల బండిలో వెళుతుండగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో బండి నుజ్జునుజ్జయింది. నారాయణరెడ్డితో పాటు ఓ ఎద్దు కూడా తీవ్రంగా గాయపడింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

సరిహద్దున గస్తీ ముమ్మరం



కొడికొండ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కేంద్ర బలగాలు

- ఎన్నికల కోడ్ అమలుతో వాహనాలు జల్లెడ పడుతున్న పోలీసులు
- రంగంలోకి కేంద్ర బలగాలు
- రూ.50 వేలు మించి నగదు ఉంటే సీజ్

హిందూపురం అర్బన్: ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెనువెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్) అమలులోకి వచ్చింది. ఈ క్రమంలో ఎన్నికలను శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. పొరుగున ఉన్న కర్ణాటక నుంచి మద్యం, గిఫ్ట్ ఐటమ్స్, నగదు జిల్లాలోకి తరలించకుండా సరిహద్దులోనే అడ్డుకుంటున్నారు. ఇందు కోసం ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే జిల్లాలోకి అనుమతిస్తున్నారు. ఇందు కోసం కేంద్ర బలగాలను రంగంలో దింపారు.

రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సరిహద్దులో శనివారం రాత్రి నుంచే నిఘా మరింత పెంచారు. జిల్లాలోని మడకశిర, హిందూపురం, కదిరి ప్రాంతాల్లో ఇప్పటికే అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను అధికారులు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ నగదు, గిఫ్టులు, మద్యం తరలింపులను అడ్డుకున్నారు. తాజాగా జిల్లా సరిహద్దున మొత్తం 19 చెక్‌పోస్టులతో పాటు ప్రత్యేక మొబైల్ వాహనాలతో తనిఖీలు ముమ్మరం చేశారు. రూ.50 వేలకు మించి నగదు, గిఫ్ట్ బాక్సులు ఉంటే వెంటనే వాటికి సరైన ఆధారాలు అడుగుతున్నారు. ఆధారాలు చూపకపోతే తరలింపుదారు ఎంతటివారైనా ఉపేక్షించకుండా వెంటనే సీజ్ చేసేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సరిహద్దులో ఆదివారం నుంచి కేంద్ర బలగాలను రంగంలో దించి పహారా ముమ్మరం చేశారు. ఏమాత్రం అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే వాహనాలు సీజ్ చేస్తున్నారు. అలాగే కర్ణాటకకు ఉన్న ప్రధాన రహదారులే కాకుండా సరిహద్దు వెంబడి పలు గ్రామాల మీదుగా ఉన్న 8 రహదారుల్లోనూ నిఘా పెంచారు.

వైభవంగా అడ్డపల్లకీ ఉత్సవం



అడ్డపల్లకీలో ఊరేగుతున్న పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ: స్థానిక గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి అడ్డపల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం బూదగవి వద్ద ఉన్న విడిది మంటపం నుంచి వెలిగొండ రస్తాలోని మఠం వద్దకు పీఠాధిపతులు చేరుకున్నారు. ఆయనకు మఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, కమిషనర్ చిట్టెమ్మ... పాదపూజ చేసి కాలుకు బంగారు గండపెండేరం తొడిగారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అడ్డపల్లకీలో కూర్చోబెట్టి పాతగాం. దీచౌక్ మీదుగా గవిమఠానికి భారీ ఊరేగింపుతో చేరుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, ఏజెంట్ రాజన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఠాధిపతిని అడ్డుకున్న గ్రామస్తులు

మఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్ర స్వామి గవిమఠానికి వెళ్లకుండా బూదగవి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆదివారం బూదగవి మఠంలో ప్రత్యేక పూజలు ముగించుకున్న అనంతరం వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న విడిది మంటపానికి పీఠాధిపతి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరుకున్న బూదగవి మంటపాన్ని పునరుద్ధరించాలంటూ కొన్నేళ్లుగా గ్రామస్తులు కోరుతున్న మఠం అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు పీఠాధిపతిని అడ్డుకున్నారు. మఠానికి రూ.కోట్లలో ఆదాయం ఉన్నా... బూదగవిలోని మఠం అభివృద్ధిని పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. ఈ అంశంపై సహాయ కమిషనర్ చిట్టెమ్మకు భక్తులు ఫోన్ చేసి, వివరణ కోరగా... తనకు సంబంధం లేదని ఆమె నిర్లక్ష్యంగా చెబుతూ ఫోన్ కట్‌చేయడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. అనంతరం గ్రామస్తులకు మఠం ఏజెంట్ రాజన్నగౌడ్ నచ్చజెప్పి స్వామిని అడ్డుకోవడం సరైంది కాదని ప్రాధేయపడి ఒప్పించారు.

రాజకీయ ప్రకటనలు తొలగించాలి

- పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు, కటౌట్లు వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే అమల్లోకి వచ్చిన ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. అనంతరం పుట్టపర్తి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల జెండాలు, పోస్టర్లు తదితరాలను వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సీ విజిల్ యాప్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వలంటీర్లు రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొంటే సస్పెండ్ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నియోజకవర్గాల అధికారులు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' రద్దు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. డివిజన్, మండల స్థాయిలో సైతం 'స్పందన' ఉండదని స్పష్టం చేశారు.

యువకుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన బాలకృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మన్న, ఉమక్క దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, రెండో కుమారుడు బాలకృష్ణ (26) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఐదేళ్ల క్రితం కళ్యాణి అనే యువతితో ఆయనకు వివాహమైంది. వీరికి నాలుగేళ్ల వయసున్న కుమార్తెతో పాటు ఏడాది వయసున్న ఓ కుమారుడూ ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలకృష్ణ... జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి టౌన్: సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. తెలియని నంబర్ నుంచి ఫోన్ చేసి మీ అకౌంట్ బ్లాక్ అయ్యిందని, మీ ఆధార్, పాన్ కార్డు అప్‌డేట్ కోసమని లింక్‌పై క్లిక్ చేయండి అని వచ్చే సందేశాలు నమ్మొద్దని సూచించారు. ఫ్రీ గిఫ్ట్, లోన్‌యాప్ అంటూ వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేసి బ్యాంక్ ఖాతా నంబర్లు, పాన్‌కార్డులు ఇతర సున్నితమైన సమాచారన్ని పంచుకోవడంవల్ల సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలో ఉన్న సొమ్మును కాజేస్తారన్నారు. సైబర్ మోసం గుర్తించేలోపు నష్టం జరిగిపోతుందన్నారు. వ్యక్తిగత సమాచారం వారి వద్ద భద్రపరుచుకొని ఇతర నేరాలకు పాల్పడే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు.



ఎస్పీ మాధవరెడ్డి

నేటినుంచి 'పోలీస్ స్పందన' రద్దు

ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమలుల్లో ఉన్నందున జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'పోలీస్ స్పందన' రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వ్యయ ప్రయాసాలతో జిల్లా కార్యాలయానికి రావద్దని సూచించారు.

దేశంలోనే అతి పెద్ద చీనీ మార్కెట్ 'అనంత'



అనంతపురం చీనీ మార్కెట్

అనంతపురం అగ్రికల్చర్: దేశంలోనే అతి పెద్ద చీనీ మార్కెట్‌గా ఖ్యాతిగాంచిన అనంతపురంలోని మార్కెట్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, ఈ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని చీనీ రైతులకు మార్కెట్ యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడాది పొడవునా చీనీ క్రయ విక్రయాలకు అనువుగా మార్కెట్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. అర టన్ను దిగుబడి ఉన్నా నిర్భయంగా ఇక్కడ అమ్ముకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. అత్యంత పారదర్శకమైన 'ఈ–నామ్' విధానంలో క్రయవిక్రయాలు నిర్వహిస్తుండడం వల్ల ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు ఉండదన్నారు. నాలుగైదేళ్లుగా ఏటా 70 వేల నుంచి 90 వేల టన్నుల వరకూ చీనీ క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, తాజాగా రూ.2.10 కోట్లతో నిర్మించిన కవర్‌షెడ్ అందుబాటులోకి తీసుకురావడంతో సీజన్ ఏదైనా చీనీ దిగుబడి దెబ్బతినకుండా ఉంటుందన్నారు. బయట తోటల్లో దళారులు, వ్యాపారులు డబుల్ సూట్ పద్ధతిలో కొనుగోలు చేస్తుంటారని, మార్కెట్‌లో ఎలాంటి సూట్లు, కమీషన్లు లేకుండా నామమాత్రపు రుసుంతో అమ్ముకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి





ఆస్పత్రి ఎదుట నెలకొన్న ఉద్రిక్తత, చిన్నారి మృతదేహంతో బైఠాయించిన కుటుంబసభ్యులు

హిందూపురం అర్బన్: వైద్యం వికటించి మూడు నెలల చిన్నారి మృతి చెందిన ఘటన హిందూపురంలో ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు.... లేపాక్షి మండలం కోడిపల్లికి చెందిన సోమశేఖర్, మంజుల దంపతుల మూడు నెలల చిన్నారికి ఆదివారం వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు వెంటనే హిందూపురంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వైభవ శ్యామల చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స అనంతరం డాక్టర్ రాసిచ్చిన సిరప్ తీసుకుని మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి చేరుకున్నారు. వైద్యుడు సూచించిన మోతాదులో మందు వేసిన కాసేపటికే శిశువు పరిస్థితి విషమించింది. దీంతో వెంటనే శిశువును తీసుకుని తిరిగి అదే ఆస్పత్రికి చేరుకున్నారు. ఆ సమయంలో డాక్టర్ బాలాజీ లేకపోవడంతో చేసేది లేక ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలియగానే బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున వైభవ శ్యామల చిన్నపిల్లల ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

భర్తపై గొడ్డలితో భార్య దాడి

- మద్యం తాగొద్దన్నందుకు భార్యను చితక్కొట్టిన వైనం
- సహనం కోల్పోయి ఎదురుదాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



చికిత్స పొందుతున్న ఓబులేసు

ఉరవకొండ: మద్యం మత్తులో తరచూ హింసిస్తుండడంతో సహనం కోల్పోయిన భార్య గొడ్డలితో భర్తపై దాడి చేసింది. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరుకు చెందిన ఓబులేసు, లలితమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కొంత కాలంగా ఓబులేసు (43) మద్యానికి బానిసయ్యాడు. సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు పెడుతూ ఇంటి బాగోగులు పట్టించుకోవడం మానేశాడు. దీంతో భార్య కూలి పనులకు వెళుతూ భర్త అవసరాలతో పాటు కుమారుడి పోషణ భారాన్ని నెత్తికెత్తుకుంది. ఈ క్రమంలో తాగుడు మానేసి, కుటుంబ పోషణపై దృష్టి సారించాలని పలుమార్లు భార్య వేడుకుంది. ఆ సమయంలో ఘర్షణ పడి ఇంట్లో భార్య దాచుకున్న డబ్బు కూడా లాక్కెళ్లి పూటుగా మద్యం సేవించి వచ్చేవాడు. ఈ క్రమంలో ఓబులేసు వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఆదివారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఓబులేసు... మరో క్వార్టర్ బాటిల్ కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ భార్యతో గొడవ పడ్డాడు. ఆమె నిరాకరించడంతో భౌతిక దాడికి దిగాడు. ఆమె ప్రతిఘటించడంతో మరింత రెచ్చిపోయిన ఓబులేసు విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో సహనం కోల్పోయిన ఆమె చేతికి అందుబాటులో ఉన్న గొడ్డలితో ఎదురుదాడి చేసింది. అనంతరం తీవ్రంగా గాయపడిన ఓబులేసును ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులతో కలసి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక అతను మృతి చెందాడు. దీంతో సాయంత్రం ఉరవకొండ పోలీసు స్టేషన్‌లో లలితమ్మ లొంగిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అలరించిన ఆదిలాబాద్ భక్తులు



సంగీత కచేరి నిర్వహిస్తున్న, అదిలాబాద్ జిల్లా సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన అదిలాబాద్ జిల్లా సత్యసాయి భక్తులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఆదివారం ఉదయం సత్యసాయి మహాసమాధి సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం అంతర్జాతీయ క్షేత్రంలో అద్భుత మూర్తి పేరుతో సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. విద్యా సంస్థలతో పాటు, వైద్య సంస్థలను సత్యసాయి స్థాపించి ప్రజలకు అందించిన సేవలను నాటిక ద్వారా చక్కగా వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయి మెడికల్ క్యాంపుల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను కొనియాడారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ప్రజల గుండె చప్పుడు వైఎస్ జగన్

- బహిరంగ సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



బహిరంగసభకు హాజరైన ప్రజలు

ధర్మవరం అర్బన్: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ గుండె చప్పుడుగా ప్రజలు భావిస్తున్నారని, ఎన్ని జెండాలు కలసి ఏకమై వచ్చిన ఆయన గెలుపును అడ్డుకోలేవని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. జనం బాగుండాలంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండాలని అందరూ కోరుకుంటున్నారన్నారు. ధర్మవరంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం సాయంత్రం 25, 26, 27, 28 వార్డుల ప్రజలతో భారీ బహిరంగ జరిగింది. నాలుగు వార్డుల ఇన్‌చార్జ్‌లు మేడాపురం సూరి, మేడాపురం వెంకటేష్, కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, సరితాల బాషా నేతృత్వంలో జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రసంగిస్తూ... ఎన్నికలకు మరో 55 రోజుల గడువుందన్నారు. 70 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వమూ పేదల గురించి ఆలోచించింది లేదన్నారు. తన పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ అధికారం చేపట్టిన తర్వాత సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారన్నారు. బంధువులు ఎవరూ ఆదుకోకపోయినా జగనన్న ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చి అండగా నిలిచారన్నారు. కరోనా సమయంలో ప్రధాని మోదీ లాక్‌డౌన్ విధిస్తే... ఆ సమయంలో బంధువులు ఎవరూ పట్టించుకోకపోయినా వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ వైద్య సహాయం, అన్ని సదుపాయాలు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ ఎక్కడేగాని సంక్షేమాన్ని ఆపలేదన్నారు.

ప్రజలను సోమరిపోతులన్నారు

చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రి అయినా ఏ రోజు ప్రజల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పేదరికం పారదోలేందుకు వివిధ పథకాల పేర్లతో సీఎం వైఎస్ జగన్ పెట్టుబడి పెడుతుంటే ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. అయితే జగన్ సర్కార్ పథకాల లబ్ధి చేకూరిన పలువురి జీవితాలు ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి చేరుకున్నాయన్నారు. పవన్ కళ్యాణ్ పార్టీ ఎందుకు పెట్టాడో ఆయనకే తెలియన్నారు. గతంలో చంద్రబాబును, మోదీని నోటికొచ్చినట్లు తిట్టిన పవన్‌కళ్యాణ్... నేడు వారి చెంతకే చేరి తనకు నైతికత లేదని నిరూపించుకున్నాడన్నారు.

జన హృదయాలను గెలుచుకోవాలి

2019 ఎన్నికల్లో ఓడిపోగానే కేవలం డబ్బు సంపాదన కోసం పార్టీ మార్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలను మోసం చేసిన నీచమైన చరిత్ర వరదాపురం సూరిదన్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తల మీద ఎలాంటి దాడులు జరగకుండా అండగా నిలవడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. 20 కార్లలో తిరుగుతూ డబ్బు సంపాదించడం గొప్ప కాదని, జనహృదయాలను గెలవాలని హితవు పలికారు. రాప్తాడు నియోజకవర్గం నుంచి మరొకరు రెచ్చగొట్టే మాటలు తప్ప ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. ఎమ్మెల్యేగా తన హయాంలో ధర్మవరం నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. చరిత్రలో అభివృద్ధి అంటే కేతిరెడ్డి పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా చేశామన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేశామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత ప్రముఖులు కాచర్ల అంజి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, కౌన్సిలర్లు సరితాల ఆశాబీ, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, పెనుజూరు నాగరాజు, నాయకులు చాంద్‌బాషా, అమీర్‌బాషా, ఉడుముల రాము, చెలిమి పెద్దన్న, కత్తె పెద్దన్న, తీర్థాల వెంకటరమణ, శ్రీనివాసులు, బాలంగోపాల్, కరీమ్, రామకృష్ణ, దాసునాయక్, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పురుషోత్తం, జింకా కంబగిరి తదితరులు పాల్గొన్నారు.